# కుక్ బోయ్ ★


రచన:
వెంకటేశ్వరరావు


చిట్టి యెన్నాళ్లనుంచో చెబుతుంది “ఎన్నాళ్లీబాధ? వంటమనిషి నెవరినైనాచూచి పెట్ట” మని. ఎప్పటికప్పుడు నేనూ “అదే ఆలోచిస్తున్నాను. సరైనమనిషి దొరకడం లేదు. మనిషి శుభ్రంగావుంటే బుద్ధికుదిరిక వుండదు. బుద్ధికుదిరికవుంటే మనిషి గలీజుగా వుంటుంది” అంటూవుండేవాణ్ణి.

ఓనాడు మాకిద్దరికీ, యీవిషయమై మాటా మాటావచ్చి రెండు మూడురోజులు హోటలు నుంచి కేరేజిమీల్సు తెప్పించుకోవడంకూడా తటస్థించింది. నాకు అప్పుడప్పుడు హోటలు మీల్సు అలవాటేకాని, ఆవిడకీ, పిల్లలకీ అవి గరళపు ముద్దలక్రింద గొంతుకు దిగేవికావు. నామీదవుండే కోపంకొద్దీ, చిట్టి ఏసీల్లో— పాలో పోసుకొని, అల్లాగే ఆహోటలు తిండి తిని కాలక్షేపం చెయ్యడానికైనా వప్పుకుంది కాని మా రాముకూ, యిందిరకూ అసలు ససేమీ ఆభోజనాలు గిట్టలేదు. వాళ్ళు ప్రతిపూటా మారాం చెయ్యడమే! వాళ్లను చూస్తే నాకు జాలేసేది!

“ఏమిటాకర్తవ్యము”ని ఓనాడు కూచుని అదేపనిగా ఆలోచించేను. వంట మనిషిని ఓ మాటుపెట్టితే, అది పప్పులో వుప్పేసిందనీ, వుప్పులో పప్పేసిందనీ, కూరలు సరీగా వండలేకపోయిందనీ, పొదుపుగా చెయ్యదు, అంతా దూబరాగా కిందింత, మీదింత పారేస్తుందనీ, తగూపెట్టుకొని చిట్టి దాన్ని సాగనంపిందాయెను! ఈమాటుమాత్రం పొసగనిస్తుందా? పెట్టేదాకా పెట్టలేదనీ, పెట్టేక అది మంచిది కాదు యిది, యిది మంచిది కాదు అది అని యీఆడవాళ్లతో యిదే తగలాటం. ఎంతమంది యీవంట మనుష్యులు సరిపడక స్వయంగా చెయ్య గాల్చుకోవడం లేదూ? చిట్టికంతా పట్టుదల గాని తాను మాత్రం చెయ్యలేకనా? ఏదో? మనకేమి? ఆవిడ యిష్టమొచ్చినట్లే కానిద్దాం! ఇంత మాత్రానికి తగవులాట యెందుకు? అని నేనొక నిర్ణయానికొచ్చి.—

“అయితే చిట్టీ! లోగడ ఓమాటు వంట మనిషిని పెట్టడమూ, అది సరిపడకపోవడమూ జరిగింది కదా? ఈమాటు ఏమి చేద్దాం!” అన్నాను.

“అంతకంటే మంచిది దొరకదా ఏమిటి? చూడండీ! మా అన్నయ్యగారికి దొరికేడు బంగారంలాంటి కుర్రాడు! వా డెక్కడ నేర్చేడో కాని యెన్నివంటలు చేస్తాడను కొన్నారూ? మా వదినె యింత చక్కగా కూచుని చెబుతూవుంటుంది. అన్నీ వాడే చేసుకపోతాడు.”

“ఔను! నేనూ చూచేనువాణ్ణి. మొన్న మనం వెళ్లినపుడు వడ్డన కూడా చేశాడు వాడేనా?”

చిట్టి కొంచెంసేపు ఆలోచించి మొగమింత చేసుకొని “ఆఁ ఔను. వాడే! వాడికేమిస్తారనుకున్నారు? తిండీ, బట్టా యిచ్చి నెలకు పది రూపాయలిస్తారు. ఎంత పనిచేస్తాడండీ వాడు?” అంది.

“నిజమే! మనకుకూడా అట్లాంటికుర్రాడు దొరికితే బాగుండును.”

## ప్రకటన

చిత్రగుప్త చందాదారులు ఆఫీసుకు ఉత్తరాలు వ్రాయునపుడు తమ చందా నంబరు తప్పక తెలుపవలయును. అలాగుచేసిన ప్రత్యుత్తరము త్వరలో బడయగలరు. తమ చందా నంబరు తెలుపనపుడు ఆఫీసు ఉద్యోగులకు వృధా శ్రమయు, కాలయాపన జరుగుచుండును.

మేనేజరు,
చిత్రగుప్త ఆఫీసు.

“నేనూ అదే ఆలోచిస్తున్నా, అల్లాంటి వాడైతే మనకూ ఖర్చు జాస్తీ వుండదు. ఆడమనుష్యులనుకుంటాం గాని వాళ్ళు గోడల్లాగు తిని లేని పోని జట్టీలు తెచ్చిపెడ్తారు. ప్రతి దానికీ మూతివిరుపూ - ముక్కువిరుపూను.”

“ఆడమనిషి అయితే ఎరమరిక లేకుండా వుంటుంది యింట్లోనని లోగడపెట్టేను. దానికేమిగాని, యీమాటు అల్లాంటి కుర్రాడు దొరికితే పోనియ్యనులే! వాడైనా బుద్ధికుదిరిక గలవాడు దొరకాలి.”

“కొన్నాళ్ళుచూస్తేగాని తెలియవు బాగోగులు. మా అన్నయ్యకు రాయండి! ఆ కుర్రవాడి తమ్ముడొకడున్నాడట! వాడూ వంట పనిలో బాగా ఆరితేరినవాడేనట! మొన్న మావదినె చెప్పింది వాడ్ని పెడితే బాగుంటుందని”

“ఓహో! అదాసంగతి? అల్లాగే రాస్తాను కాని నాకొక చిన్నసందేహం”

“ఏమిటి ఆ సందేహం?”

“ఏమీ లేదు. మీ వదినెలాగే నువ్వు కూడా మారిపోగలవా? అని. పూర్వంలాగే అన్నీ నేనే చేసుకోవాలి. నే చేసుకుంటేగాని బాగుండదు. అని వాడ్ని దుక్కలాగా మేపి, అన్నీ నువ్వే చేసుకుంటూంటే, వాడు త్వరలోనే మారిపోయి ఎందుకూ పనికిరాకుండా పోతాడు. రౌతు మెత్తనైతే గుర్రం మూడు పాదాలమీదే నడుస్తుందంటారే పెద్దలు - ఆ సామెతకొస్తుంది మన వ్యవహారం కూడా”

“ఆఁ! అల్లా యెందుకు చేస్తాను లెండి!”

“సరే! అయితే రాస్తాను. మళ్ళా యీ వారంనాటికల్లా వాడొస్తాడు”

ఆవిధంగా తీరింది మాయిద్దరికీ వంటమనిషి కోసం పుట్టిన రగడ. చిట్టి మామూలుగా వంట చెయ్యడం మొదలుపెట్టింది. అప్పట్నుంచీ! పిల్లలు సంతోషించేరు అమ్మచేసిన

పదార్థాలు కమ్మగా తినొచ్చునని. అల్లా వారంరోజులు గడిచినై. కాని ఆ కుర్రవాడు యింకా రాలేదు. మేము రాసిన వుత్తరానికి జవాబుకూడా రాలేదు. చిట్టికి ఆతురత యెక్కువయింది. "మళ్ళా రాయన్నా రాయండి! ఏమైందో లోగడ రాసిన వుత్తరం?" అంటోంది ఎప్పటి కప్పుడు.

"ఓహో! ఇది చాలా తీరని సమస్యగానే వుంది!" అనుకొని "అల్లాగే రాస్తాను" అన్నాను ఓమాటు.

"అల్లాగే రాయటం కాదు. ఈమాటు గట్టిగా రాయండి. నన్నుచూచి అంతా వేళాకోళంచేస్తున్నారు యింకా స్వయంగా వంట చెయ్యడమేమిటిని-అని"

"ఏం? స్వయంగావంటచేసుకుంటే తప్పా? నువ్వు చెప్పలేకపోయినావా యింకా మాకు సరైన కుర్రవాడు దొరకలేదని?"

"చెప్పడానికేమి లెండి? ఎన్నయినా చెప్పవచ్చును! మీకుమాత్రం యెల్లావుంటుంది చెప్పండి, నేనా పొగతో చెమటలు గార్చుకుంటూ బాధపడుతూంటేను?"

"నిజమే! నాకుమాత్రం యిష్టమా? ఎవరినో ఒకరిని చూచిపెడదాము యీమాటు" అని అప్పటి కా సంభాషణకు స్వస్తిచెప్పేను.

*　　*　　*

ఆనాడొక దూరపు క్యాంపునుండి వారం పదిరోజులకు గాబోలు, తిరిగి యింటికి జేరుకున్నాను. సాధారణంగా నాకు ఆఫీసుపని మీద, యింటివ్యవహారాలు జ్ఞాపకం రావు. తిరిగియింటిమొహం పెడ్తేనే గాని యిల్లూ, భార్యా, పిల్లలూ, సంసారమూ, జ్ఞప్తికి రావు. నే నింట్లో అడుగుపెడ్తూండగానే, యెదురుగా ఒక బక్కపలచటి కుర్రవాడు మాయింట్లో అగుపించేడు. నన్ను చూడ్డంతోటే, యింటి యజమానినని గుర్తించేడు కాబోలు, నాకు నమస్కారం చేశేడు. క్యాంపుసామానులు వగైరా అందుకొని, లోపల జాగ్రత్తపెట్టి, నాహ్యాటూ, బూటూ వగైరా కూడా అందుకోవడానికి తహతహపడ్తున్నాడు. నాకు చాలా ఆశ్చర్యమయింది. ఆ కుర్రవాడికి చూడబోతే నిండా పదిపన్నెండేళ్ళు లేవు. ఇంత లోకజ్ఞానమూ-బుద్ధి కుదిరికా యెల్లా సంపాయించేడా? అని.




అంతలో చిట్టి యెదురుగా ప్రత్యక్షమయింది కిలకిలా నవ్వుతూ—

"చూశేరా? వీడే నేను చెప్పిన కుర్రవాడు. మా అన్నయ్య పంపేడని మొన్నటిదినం మధ్యాహ్నం బండికి వచ్చేడు" అంది.

"సరి! బాగుంది! వాడేగద వీడు? ఇక నీఛార్జీ వప్పగించు. వంటా-యింకా మిగతా చిల్లర మల్లర పనులూను—

"ఆఁ—వచ్చిన మరు క్షణాన్నే పుచ్చుకున్నాడు ఛార్జీ అంతా."

"ఛార్జీ వప్పగించడముతో అయిపోలేదు. పైనుండి జాగ్రత్తగా అన్నిపనులూ చేయించుకోవాలి!"

"అల్లాగేలెండి! వాడూ చిన్నవాడేకదా? ఎల్లా చెప్పితే అల్లాగే చేసుకపోతాడు!"

మామాటలు వింటూనే ఆకుర్రవాడు నాకు భోజనప్రయత్నంచేస్తున్నాడు. ఇంకా మధ్యాహ్నం పదకొండు ఘంటలు కాకపోవడంమూలాన్న, పిల్లలభోజనాలుకూడా కాలేదు. అందరికీ యేకపంక్తిని వడ్డించేడు. నేనూ చిట్టీ పిల్లలూ అందరూ భోంచేస్తున్నాం. చిట్టి సంతోషానికి పట్ట పగ్గాలు లేవు తన కోరిక యిన్నాళ్లకు ఫలించింది గదా అని.

"అయితే చిట్టీ! ఈరోజు వంట యెవరు చేశేరు?" అన్నాను.

"గోప్పి"

"అంటే?"

"వీడే"నని ఆ కుర్రవానికేసి చూసింది తలపైకెత్తి.

"ఉహుఁ గోప్పీ! ఎంత బాగుంది పేరు! వాడు చేసిన పదార్థాలు కూడా పేరు లాగే వున్నాయి!" అన్నాను.

పిల్లలుకూడా లొట్టవేసుకుంటూ గోపి చేసిన పదార్థాలు చాలా బాగున్నవన్నారు.

అల్లాగే కాలం గడచిపోతోంది. గోపి కూడా మాలో కలసిపోయి యింటిపనులన్నీ తిరిగి తిరిగి చెప్పాలిసిన అవసరం లేకుండా "రొటీన్"క్రింద చేసుకపోతున్నాడు. చిట్టికి శ్రమ తగ్గింది. ఎవరన్నా మాయింటికి వచ్చిన బంధుజనంగాని, స్నేహబృందంగాని "యితడెవ్వరు? ఎక్కడినుంచి సంపాయించేరు ఇంత చురుకైన "కుక్ బోయ్" నని అడిగితే "మావాడే" నని ముక్తసరిగా జవాబిచ్చేవాళ్ళం. మాకందరికీ గోపిమీద యెంతో ఆప్యాయం! గోపికి మేమంటే యెంతో విశ్వాసం! గోపి కూడా మాపిల్లలతోపాటే అయిపొయ్యేడు

కొన్నాళ్లకి. వయసుకు చిన్నవాడే అయినా, చిట్టి యాజమాన్యంక్రింద బాగా తరిఫీదు అయ్యేడు. నాకు చాలా సంతోషమయింది. చిట్టి ఇన్నాళ్ళు బాధపడ్డందుకు చేతికింద మంచి ఆసరా దొరికింది. అల్లా కొంతకాలం దొర్లించేయవచ్చు ననిపించింది.

* * *

ఆనాడు సంవత్సరాది. పిల్లలతోపాటు గోపికి కూడా బట్టలు వగైరా కొన్నాము. ఆ కిందటిదినమే గోపీ అన్న, తమ్ముణ్ణిచూడ డానికి మాయింటికివచ్చి యిక్కడేవున్నాడు. ఉదయమే అందరి స్నానాలూ అయి కొత్త బట్టలు ధరించేము. ఉగాది అవుటచేత ఆ రోజువుదయం లగాయితు మధ్యాహ్నందాకా నాకు తెలిసినవాళ్ళు, కింది వుద్యోగస్థులు, తాబేదార్లు వచ్చి "న్యూయియర్ గ్రీటింగ్సు" యిచ్చిపోతున్నారు. నేనా హడావుడిలో వుండి ఇంటిపరిస్థితులేమీ అంతవరకు పట్టించు కోలేదు.

సాయంత్రం నాలుగైదు ఘంటలవుతుంది. నేనెవరో "ఫ్రండ్సు"తో "యెంగేజి"అయి వుంటే మా రాము గబగబావచ్చి "నాన్నా రండీ! నాన్నారండీ! గోపి యేమయ్యేడో అగుపించడంలేదండీ! మాకు 'టీ' కూడా తయారుచెయ్యలేదూ!" అన్నాడు.

నేను నమ్మలేదు. "చూడు! అక్కడే ఎక్కడో వుంటాడు. త్వరగా నాలుగు కప్పులు 'టీ' తయారుచేసి తెమ్మను" అన్నాను.

ఇంతలో, లోపల చిట్టి ఏదోహడావుడి పడ్తూన్నట్లు వినిపించింది. నాకేమీతోచలేదు. గబగబా లోపలికి వెళ్లేసరికి చిట్టి చెప్పింది "గోపీ, వాళ్ళ అన్న యిద్దరూ పరారై పొయ్యే"రని.

"ఏమైనా పట్టుకపోలేదు కదా?" అన్నాను.

"ఏమి పట్టుకపోతారు లెండి? వాళ్ళ కేమైనా అందనిస్తేగదా?

"అల్లాకాదు. నువ్వెంత జాగర్తగా వుంటున్నా, వాళ్ళు పరారైపోవడానికి కారణ ముండకపోదు. జాగర్తగా చూడు!" అని యివతలికి వచ్చి నాకోసరం వెయిట్ చేస్తున్న "ఫ్రండ్సు" మర్యాదలుచేసి వాళ్ళను సాగ నంపేను.

తరువాత చిట్టి చెప్పింది చల్లగా తాను నెలవాడకానికి దాచిన వంద రూపాయిల నోటు కనిపించలేదని "అది వేసుకపోయి వుంటారు యిద్దరూ" అని అనుకున్నాం.

"గోపి కల్లాంటిబుద్ధి లేదు! వాళ్ళఅన్న నేర్పివుంటాడు!" అంది చిట్టి.

"ఇంతే! ఏముంది మరి? పరాయివాళ్లను యింట్లో పెట్టుకుంటేను" అన్నాను నాకు వచ్చిన కోపమంతా దిగ్రదొక్కుకుంటూ.

"ఇంట్లో పెట్టుకుంటేమట్టుకు యిల్లాంటి పనిచేస్తారేమిటి?"

"వాళ్ల అంతు కనుక్కుంటాను!"

"అంతూలేదు! కనుక్కోవడమూ లేదు! వూరుకోండి. పరువు నష్టం కూడాను!"

"ఊరుకుంటే వాళ్లకు మరింత అలుసు కదా?"

"పోనీయండి! ఈ యేడాదినుంచీ మన యింట్లో వున్నాడు కదా? నెలకు పది రూపాయీల చొప్పున నూట యిరవై రూపాయ లైనవా? వాడికీ వందరూపాయీలతో సరి!" అంది చిట్టి తన స్త్రీసైజం కనుపరుస్తూ.

"ఇరవై రూపాయీలు లాభమయినవనే ఆలోచిస్తున్నావు కాని, యిల్లాంటిదగాకోరు పని చేశాడని యెంచవూ కదా?"

"ఔను! వాణ్ణి యిప్పుడేమిచేస్తేమట్టుకు లాభము? వృథాశ్రమా! ధనవ్యయమూను!"

"సరే! ఇక్కడ యీవిధంగా జరిగింది. అక్కడ మీ అన్నయ్యగారింట్లో ఏమి జరిగిందో?"

"ఏమో? నెమ్మదిమీద గాని తెలియదు ఢండారము" తరువాత కొన్నాళ్లకు తెలిసింది గోపీ అన్న తుంటరిగా తిరుగుతూంటే వాళ్లంతట వాళ్లే వెళ్లగొట్టేశారనీ, అక్కణ్ణుంచి మాయింటికొచ్చి యీపని చేశేడనీ. అప్పుడు "చూశేవా? చిట్టీ! ఈరోజుల్లో ఎవరైనా యింతే! కడుపున బుట్టిన పిల్లలకే మంచి బుద్ధి రావడంలేదు. అల్లాంటప్పుడు పరాయివాళ్ల నెంత జాగర్తగా చూస్తేమట్టు కేమిటి?" అన్నాను.

"ఔను! పిదప రోజులూ! పిదప బుద్ధులూను! మంచికి తావులేదు. యీరోజుల్లో!" అంది ఒహ నిట్టూర్పుతో——

ఆవిధంగా తీరింది చిట్టికి కుక్ భోయ్ సరదా.

* * *

తరువాత కొన్నాళ్ళకు మాబొమ్మ చెల్లెలు ఒకావిడ మాయింటికి తనతనం తెల్లార్చుకునే నిమిత్తం వృద్ధాప్యంలో రావడమూ——ఆవిడ రాకతో మాకు యింట్లో రెండోమనిషి ఆసరాలేని కొఱత తీరడమూ——తటస్థించింది. ఎల్లాంటి వాళ్ళయినా, యింట్లో వాళ్ళు యింట్లో వాళ్ళే! బయటివాళ్ళు బయటి వాళ్ళే!!

